*బాధ్యతల్ని చులకనచేసి, జీవితం తమ సుఖంకోసమే వుందనుకునేవాళ్ళు, జీవితం వేసే శిక్షను కూడా భరించక తప్పదు.*

# అపస్మృతి

చైతన్య

రాజుకి కలలోంచి హఠాత్తుగా మెలుకువ వచ్చింది. ''అమ్మా!'' అని అరిచేడు - నిద్ర చెదిరి, పడుకున్న గదీ, గదిలో సామాన్లూ కనబడం మొదలయ్యేక, లేచి మంచం మీద కూర్చువ్నాడు. మోకాళ్ళు ముడుచుకుని, చుట్టూ చేతులు కట్టుకుని, కాళ్ళ మీద మొహం ఆనించి శూన్యంలోకి చూస్తూవుంటే, ఆలోచనలు చుట్టుముట్టేయి. కళ్ళల్లోంచి నీళ్ళు ధారలుగా రావడం మొదలెట్టేయి

పెదిమలు బిగపట్టి తనని తాను అదుపులోకి తెచ్చుకుని, వెనక్కి మంచంమీద వాలేడు. రేపేకదా హైదరాబాదు వెళ్ళడం. ఇంకో పది గంటల్లో ఇక్కడ్నించి దూరంగా వెళ్ళిపోతున్నానని అనుకోగానే, వెడుతూ వెనక వదులుతున్న జ్ఞాపకాలు మళ్ళీ కళ్ళముందుకు వచ్చేయి. రాజు కళ్ళలో విచారం, కోపం, కసీ రావడం మొదలెట్టేయి.

* *

"సామానంతా కారులో పెట్టేర్రా!"

పోర్టబుల్ టేప్ రికార్డరు చెవిదగ్గర పెట్టుకుని 'ఆబా'పాట దీక్షగా వింటున్న రాముకి నాన్న మాటలు వినబడలేదు

శంకరం రాముకేసి పదిసెకన్లు దీక్షగా చూసి చిరునవ్వు నవ్వుకున్నాడు "వెధవకి పది ఏళ్ళులేవు తన స్వంత ప్రపంచం




సృష్టించుకోడం మొదలుపెట్టేసేడు" అనుకున్నాడు.

డ్రైవరు ఓంప్రకాష్ యింట్లోంచి టిఫిన్ కారియర్, ఫ్లాస్కు, పళ్ళు పెట్టిన బుట్ట తీసుకునివస్తూ శంకరం మాటలు విని "అయిపోయింది సార్! ఇదే లాస్టుది" అన్నాడు.

డ్రైవరు వెనకే మెట్లుదిగి పోర్టికోలోకి వస్తున్న శారదని కళ్ళార్పకుండా చూసేడు శంకరం. "పసుపుపచ్చ చీరమీద ఆకుపచ్చ స్లీవ్‌లెస్ జాకెట్ ఎంతో బాగా మాచ్ అయినట్లు అనిపించింది శంకరానికి. 'ఊఫ్' అన్నాడు గుండెలనిండా గాలి పీల్చుకుని వదులుతూ. శారద, శంకరాన్ని

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★100% పాలియస్టర్ చీరలు.
★ఫుల్‌వాయిల్, ఆఫ్‌వాయిల్ చీరలు
★షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★డ్రస్ మెటీరియల్సు, బెడ్ షీట్లు, ఈజి టవలు, ఫాండా వగైరాలతో
★స్కూలు యూనిఫారంలు...వగైరాలకు
విజయ షో రూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
U.D. హాస్పిటల్ రోడ్డు
గవర్నరుపేట, విజయవాడ-2.

కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెండ్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెండ్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు

శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

చూసి "బుద్ధిలేదు! వసంత! వేషాలు వెయ్యడం అలవాటయింది" అంది. శంకరం దృష్టి మరల్చుకుని 'పద. రాజు ఎక్కడ కలుసుకుంటానన్నాడు' అన్నాడు.

"ఛెమ్స్‌ఫోర్డు క్లబ్బులో పికప్ చేసుకోమన్నాడు" అంది శారద. రాజు శంకరానికి తమ్ముడు. "ఏడవలేకపోయేడు! ఒక్కరోజు టెన్నిసు మానేస్తే ఏమవుతుంది? ఇప్పటికే లేటయింది ఇలా మరి లీలు చేస్తూ వెడితే ఈరోజు జమ్మూ చేరినట్టే" అని వాచీ చూసుకున్నాడు శంకరం.

"ఓమీ, పద! 8 గంటలయిపోయింది" అని కారులో కూర్చున్నాడు. శంకరం వెనకసీట్లో కూర్చున్నాక కారు తలుపుమూసి ఓంప్రకాష్ స్టీరింగుముందు కూర్చున్నాడు. శారద కారు కిటికీలోంచి పనికుర్రాడికి, వాళ్ళు లేనప్పుడు ఏఏ పనులు చెయ్యాలో ఆఖరిసారిగా చెప్పి "ఓమీ! పద" అంది.

ఓంప్రకాష్ చేతులు జోడించి దేవుడిని ప్రార్థించుకుని కారు స్టార్ట్ చేసేడు.

"రాజు తన బట్టలన్నీ సర్దుకున్నాడా, నీ మీద వదిలిపోయేడా?" అడిగేడు శంకరం.

"ఏమయితే నేమిటి?" అని నవ్వింది శారద.

శంకరం చిరునవ్వు నవ్వేడు "రేపొద్దున అడుగు ఆ ప్రశ్న. వాడికి ఏదైనా షర్టు దొరక్కపోతే ఏమవుతుందో చూస్తాను."

"నాన్నా! కాశ్మీరు ఎప్పటికి చేరతాం?" అన్నాడు రాము ఫ్రంట్ సీటు లోంచి వెనక్కి చూస్తూ.

"ఈ రోజు రాత్రి జమ్మూలో ఆగి, రేపొద్దున లేచి కాశ్మీరు వెడదాం. తొందరగా నిద్ర లేచేవంటే రేపు మధ్యాహ్నానికల్లా పత్నీటాప్ వెళ్ళిపోవచ్చు. సరేనా! ఆ టేప్ రికార్డు ఆపు" అన్నాడు శంకరం.

ఛెమ్స్‌ఫోర్డు క్లబ్బులోకి తిరగ్గానే రాజు పరిగెత్తుకుంటూ వచ్చేడు. టెన్నిసు డ్రెస్ అలాగే వుంది. చెమటలు కక్కుతూ, చేతుల్లో మూడు రాకెట్లు పట్టుకుని, తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ ఫ్రంటు సీటు తలుపు తెరిచాడు.

"వెనక్కి వెళ్ళు బాబాయ్! ఫ్రంట్ సీటులో నేను ఒక్కడినే కూచోవాలని వుంది" అన్నాడు రాము

రాజు ఓరకంటితో శంకరంకేసి చూస్తూ "ఒరేయ్! మీ నాన్న ఈ చెమటలతో నన్ను ఫ్రంట్ సీటులోనైనా కూర్చోనిస్తేచాలు - తన దగ్గర బ్యాక్ సీటులో కూర్చుంటే బయటకు తోసేస్తాడు. జరుగు జరుగు" అని రాము ప్రక్కన కూర్చున్నాడు.

"ఓ! ఒక్కనిముషం" అని విజిలు వేసి బోయ్‌ని పిలిచి "ఈ రాకెట్లు లాకర్‌లో పడెయ్యి. తరవాత తీసుకుంటా" అని, ఓంప్రకాష్‌కేసి తిరిగి "ఓమీ! ఇప్పుడు పద. మా అన్నయ్య నన్ను తిట్టిన తిట్లు వినివుంటావు. ఇంటినించి క్లబ్బువరకూ. నా వేపునించి ఏమీ ఆలస్యం అవలేదు కదా, చూడు" అన్నాడు రాజు.

ఓంప్రకాష్ నవ్వుకుంటూ కారు ముందుకు డ్రైవ్ చేస్తుంటే, శారద అడిగింది-

"మ్యాచ్ ఏమయింది?"

"ఏమయివుంటుంది? గెస్!" అన్నాడు రాజు.

"ఓడిపోయివుంటాడు." అన్నాడు శంకరం నవ్వుతూ.

"నో సర్! కష్టపడి నెగ్గేను" అన్నాడు రాజు పిడికిలి బిగించి చెయ్యి పైకెత్తి.

శంకరం రాజుకేసి ఆశ్చర్యంగా చూసేడు. "నిజమా, కోస్తున్నావా?" అన్నాడు. ఆ రోజు క్లబ్ ఛాంపియన్ నందన్‌తో ఫ్రండ్లీ మ్యాచ్ ఆడేడు రాజు.

"చాలా కష్టమయింది కాని, ఐ మేడిట్" అన్నాడు రాజు

శంకరం ప్రేమగా చూసేడు రాజు కేసి. "వెధవ వేషాలు వేస్తాడుకాని, కష్టపడి అనుకున్నది సాధిస్తాడు" అనుకున్నాడు.

"అన్నట్టు రమేష్ సక్సేనా క్లబ్‌కి వచ్చేడా" అని అడిగేడు.

"ఆఁ! వచ్చేడు. అతనికి చెప్పేను మేం వచ్చే పదిహేను రోజులూ కాశ్మీరులో తిరుగుతున్నాం. రేపు పార్టీకి రావడంలేదని" అన్నాడు రాజు.

"ఏమన్నాడు?" అన్నాడు శంకరం.

"ఏమంటాడు? బాగా తిట్టేడు. 'శంకరం లేకుండా నా వెడ్డింగ్ యానివర్సరీ ఏమిటి? మరేదైనారోజున పార్టీ చేస్తాను. డామిట్' అన్నాడు." రమేష్ సక్సేనా, శంకరానికి చాలా మంచి మిత్రుడు.

"తప్పులేదని చెప్పేవా?" అన్నాడు శంకరం.

"లేదు. ఎందుకు చెప్పడం? తప్పకపోతేనే నువ్వు అతని వెడ్డింగ్ యానివర్సరీకి వెళ్ళవని అతనికి తెలియదా?" అన్నాడు రాజు.

శంకరం బుర్ర ఊపేడు.

"అయామ్ గెటింగ్ స్లీప్! రామూ! టేప్ రికార్డరు పెట్టారా. భూపేందర్ టేపు తియ్యి" అన్నాడు రాజు.

"ఇంక మొదలయింది" అన్నాడు శంకరం.

రాజు వెనక్కి చూసి "చిన్నీ! రిలాక్స్ నువ్వొక అందమైన అమ్మాయి పక్కన కూర్చున్నావు. పాపం - నేనూ, రామా సంతోషంగా వుండడానికి యింకేవో మార్గాలు వెతుక్కోవాలి. కదురా రామా" అన్నాడు.

రామ "అవును" అన్నాడు.

శంకరం చిరునవ్వుతో చిరాకు చూపిస్తూ "స్టుపిడ్! నువ్వింక బాగుపడవు. నోరు మూసుకుని పాటలు విను" అన్నాడు.

రాజు ఐఐటి. ఢిల్లీలో కెమికల్ యింజనీరింగ్ ఫైనల్ యియర్ చదువుతున్నాడు. తన అన్నయ్య శంకరం యింట్లో నే వుంటున్నాడు శంకరంకూడా ఇంజనీరే. ఢిల్లీలో ఒక ఇంజనీరింగు కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నాడు. శంకరానికి ముప్ఫయిఅయిదు ఏళ్ళుంటాయి. చిన్న వయసులోనే మంచి పొజిషన్‌లోకి రావడానికి వుండాల్సిన లక్షణాలన్నీ శంకరంలో కనబడతాయి. తెలివితేటలు, ఆత్మవిశ్వాసం, వినయం, చూసేవాళ్ళకి హాయిగా అనిపించే చిరునవ్వు — వీటికి తోడు నల్లటి వుంగరాల జుట్టూ, చక్కటి కనుముక్కు తీరూ — రాజు కొండ మీగనించి ఎగురుతూ, దూకుతూ ప్రవహించే జలప్రవాహం లాంటివాడు — ఎప్పుడూ చైతన్యంతో తన చుట్టూవున్న మనుష్యుల్నీ, పరిస్థితినీ ఉత్తేజపరచి ఉత్సాహం తీసుకొస్తాడు — అతనిలోంచి ఎప్పుడూ ఉరకలు వేస్తూండే ఉత్సాహాన్ని చూసి శంకరం అప్పుడప్పుడు అంటాడు: "దానికి సంకెళ్ళువేసి అదుపులో పెట్టాలిరా. లేకపోతే ఆ బలం నిన్నే యీడుచుకుపోవచ్చు" అని. రాజు "నువ్వు నా మీదయిష్టంతో అలాఅంటావు. కాని నా అంత మామూలు మనిషి యింకెక్కడా వుండడు. యింకా ఎంత దూసుకుపోతే శిఖరానికి చేరతామో నీకు తెలియదా" అంటాడు.

"ముందు ముందు, వాడే తెలుసుకుంటాడు" అనుకుంటాడు శంకరం. రాజు యెప్పుడూ ఆటల్లో ముందే. శంకరానికీ, అతనికీ పోలికలు బాగా వున్నాయి. కాని రాజు శంకరంకంటే పొడుగ్గా ఆరు అడుగుల పైన వుంటాడు. కసరత్తుచేసిన వంటితో "స్మార్ట్ ఫెలో" అనిపిస్తాడు చూడగానే. చదువులో ఫస్ట్ కాకపోయినా మంచి మార్కులే సంపాదిస్తాడు. శంకరానికి రాజంటే బోలెడు అభిమానం. బయటికి చూపిస్తే చెడిపోతాడని మందలిస్తూ వుంటాడు. రాజు కూడా చిన్న పిల్లాడు కాదు ఇవి అర్థం చేసుకోలేకపోడానికి. ఒక రోజున నవ్వుతూ శారదతో అన్నాడు: "అన్నయ్యకి నా మీద నిజంగా కోపం


## పాల్ నురుగల సైన్యం రావాలి! మురికిపై దాడిని చేయాలి!!




మురికి, జిడ్డు, మరకలపై పాల్ నురుగుల దాడి ప్రారంభం కానివ్వండి! పాల్ నురుగుల సైన్యాన్ని రంగంలోకి దిగనివ్వండి!! మురికి జిడ్డు మరకలతో ఇవి కలియబడడం చూడండి. వాటిని సమూలంగా నాశనంచేసి, తళతళలాడే స్వచ్ఛమైన తెల్లని బట్టలు మిగులుతాయి.




ఉత్పత్తిదారులు:
అల్ట్రా మరైన్ అండ్ పిగ్‌మెంట్సు లిమిటెడ్
రాణిపేట, తమిళనాడు

వస్తే తప్ప నేను బాగుపడనని చెప్పు — ఇలా కోపం నటిస్తే నాకు తెలియదనుకుంటున్నారా?" అని. ఆ మాట శారద అంటే, శంకరం "వాడి మీద నిజంగా నాకు కోపం ఎలా వస్తుంది? అది ఈ జన్మలో జరగదేమో" అన్నాడు. శంకరం కళ్ళల్లో నీటి పొర లీలగా కనబడింది శారదకి.

ఒకరోజు శకుంతల అనే అమ్మాయితో టెలిఫోన్‌లో మాట్లాడుతూ "హేంగ్ యువర్ సెల్ఫ్" అని రాజు అనడం శంకరం విన్నాడు. శంకరం రాజుమీద కోప్పడ్డాడు. "ఆడవాళ్ళతో ఎప్పుడూ అలా రూడ్‌గా మాట్లాడకు" అన్నాడు

అది వినిరాజు "చిన్నీ! అమ్మాయిలు, అబ్బాయిలం అందరం కలిసి మాట్లాడుకుంటున్న చోటికి నిన్ను తీసికెడతాను ఓరోజు. అప్పుడు మమ్మల్ని ఒక అర గంట చూసి, తరవాత యిలాంటి సలహాలు యివ్వగలవేమో చూడు ఆ అమ్మాయి నన్ను ఫోనులో ముద్దుగా "బాస్టర్డ్" అని తిట్టినట్టు నీకు వినబడలేదు కదా! దటీజ్ లైఫ్" అన్నాడు.

"ఓ! గాడ్" అన్నాడు శంకరం. ఈ విషయం ఓ రోజు శారదతో చెపుతూ "నేను వాడిలా కాలేజీలో చదివి పన్నెండు ఏళ్ళయింది - ఇంతలో కాలేజీ జీవితం, పద్ధతి ఎంతలా మారిపోయాయి! వాళ్ళని చూస్తే విచిత్రంగా వుంది" అన్నాడు.

నేషనల్ హైవేమీద కారు మెత్తగా జారుతున్నటు శరవేగంగా వెడుతుంటే, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల పచ్చని చేలనీ, మనుష్యులనీ చూసుకుంటూ పాటలు పాడుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ రాత్రికి జమ్మూ చేరేరు. ఆ రాత్రి జమ్మూలో మజిలీ చేసి మర్నాడు ప్రొద్దుటే లేచి, మధ్యాహ్నానికల్లా పత్నీటాప్ చేరేరు. అక్కడి పైన్ చెట్లు, దూరాన్ని కొండలూ, చల్లటి కొండ గాలి. నిశ్శబ్దంగా వున్న ఆ ప్రకృతి సౌందర్యంలో భూలోకంలో స్వర్గలోకం అంటే యిదే అనిపించింది వాళ్ళకి. పత్నీటాప్‌లో ఆగగానే, రాజు కారులోంచి దిగి గెస్ట్‌హౌస్‌లోకికూడా వెళ్ళకుండా, స్కెచ్ బుక్ తీసుకుని చెట్లమధ్యనించి కొండల్లోకి పరుగెత్తేడు. అక్కడవున్న పని కుర్రాడి చేత సామాన్లన్నీ గెస్ట్‌హౌస్‌లో పెట్టించి, టీ తెప్పించి, రాజుకోసం కొంచెంసేపు చూసి, ఎంతకీ రావడంలేదని, వాళ్ళు టీ తాగి బయట తిరగడానికి వచ్చేరు.

"పద! తిరుగుతుంటే ఎక్కడోదొరుకుతాడు మనవాడు" అన్నాడు శంకరం.

సమతలంగా, చక్కటి పచ్చగడ్డి, చుట్టూ పువ్వులూ వున్న ప్రదేశంలో శంకరం, శారదా కూర్చుని కబుర్లు చెప్పుకుంటుంటే, రామ అటూ ఇటూ పరుగెడుతూ, మధ్యలో వచ్చి "నాన్నా! బాబాయి ఎక్కడ వున్నాడో చూడు" అన్నాడు. శంకరం, రామతో కలిసి ముందుకు వెళ్ళి చూస్తే, కొండమీంచి దిగువగా లోయలో పువ్వులమధ్య, బోర్లా పడుకుని, స్కెచ్ వేస్తూ కనబడ్డాడు రాజు.

"హే" అని అరిచేడు శంకరం. రాజు పైకిచూసి చెయ్యి వూపేడు. శంకరం పిలుపు కొండలమధ్యనించి ప్రతిధ్వనించింది. గాలిచప్పుడు, పక్షుల కిలకిలా రావాలు తప్ప మరే చప్పుడూ వినబడ్డం లేదు శారద నెమ్మదిగా నడిచి వచ్చి శంకరం పక్కన నిలబడింది. "అద్భుతంగా వుందికదూ" అంది. శంకరం నిశ్శబ్దంగా శారదని దగ్గరగా తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

కొంతసేపు పోయేక రాజు వచ్చి, వాళ్ళని కలుసుకుని వేసిన స్కెచ్ చూపించేడు, చుట్టూవున్న దివ్యమైన వాతావరణాన్ని అందంగా చిత్రించి మధ్యలో ఒక చక్కటి అమ్మాయిని చిత్రించేడు

శంకరం అది చూసి శారద కిచ్చేడు- "పూర్ ఫెలో" అన్నాడు

"ఏం?" అన్నారు శారదా, రాజూ ఒక్కసారి.

శంకరం పకపకా నవ్వేడు. "పూర్ ఫెలో కాక. లక్కీ ఫెలోవా? ఇంత చక్కటి ప్రదేశంలో ఒంటరిగా తిరుగుతున్నావు" అన్నాడు.

రాజుకూడా నవ్వేడు.

అక్కడ్నించి మర్నాడు వాళ్ళు పహల్‌గామ్ వెళ్ళి చుట్టూ చూసుకుని ఒకరోజున 'ఆడూ'కేసి వెడుతుంటే వాళ్ళ కారుకి ఎదురుగా వస్తున్న కారుని చూసి శంకరం చెయ్యి బయటికి పెట్టి వేవ్ చేసేడు 'హాయ్' అని గట్టిగా అరిచి. ఎదురు కారులోంచి గౌరవ్‌పాండే బయటకు దూకేడు. శంకరానికి గట్టిగా హాండ్‌షేక్ యిచ్చేడు. గౌరవ్ శంకర్ బొంబాయిలో కలిసి చదువుకున్నారు. తరువాత ఉద్యోగరీత్యా ఢిల్లీ వచ్చేరు. శారదా, రాజూ కారులోంచి దిగి శంకరం పక్క నిలబడ్డారు. గౌరవ్ భార్య శాంతి కారులోంచి దిగింది. నమస్కారాలు పూర్తి అయ్యేక గౌరవ్ చెప్పేడు. వాళ్ళంతా చందన్‌వాడీ వెళ్ళడానికి ప్రయత్నించి రోడ్డు బావులేదని తిరిగి వస్తున్నారని. "మేం ఎలాగో కారులోవెళ్ళవచ్చాం నిన్న. తెలుసా?" అన్నాడు శంకరం.


"నిజమా?" అన్నాడు గౌరవ్ నమ్మలేనట్టు, ఆ రోడ్డు నిండా వున్న కంకర, ఫస్టు గేరులో తప్ప ఎక్కలేనంత స్లోప్, వంకర టింకరగా తిరిగే రోడ్డు చూసిన వాళ్ళెవరైనా కారులో వెళ్ళడమంటే అలాగే ఆశ్చర్యపోతారు.

ఇంతలో శంకరం, గౌరవ్ కారులోకి చూసి "మీతో యింకా ఎవరు?" అన్నాడు.

"సీతా! ఇటురా!" అని పిలిచేడు గౌరవ్.

సీతా కారులోంచి దిగగానే, ఆవిడని చూసి రాజు, శంకరం శారద స్థాణువులైపోయేరు. శంకరం మళ్ళీ మళ్ళీ "ఇంపోసిబుల్! ఇంపోసిబుల్" అనడం మొదలు పెట్టేడు.

గౌరవ్ "ఏమయింది?" అన్నాడు. అతనికి వీళ్ళలా ఆశ్చర్యపోడం అర్థంకాలేదు. రాజు కళ్ళు స్థిరంగా సీతామీదే నిలిచిపోయేయి. ఈపరిస్థితిచూసి సీతా తడబాటు



వచ్చింది. అందరిలోకీ ముందు శంకరం కోలుకున్నాడు.

గట్టిగా నవ్వి "ఈవిడ పేరు సీతా కాదూ అన్నావు" అన్నాడు.

"అవును నా మరదలు. మీరంతా ఏమిటిలా అయిపోయేరు" అన్నాడు గౌరవ్.

"రాజూ! చూపించు వీళ్ళకి" అన్నాడు శంకరం.

రాజు కారులోంచి తను పత్నీటాప్‌లో వేసిన చిత్రం తీసి చూపించేడు. అది చూసేక ఆశ్చర్యపోవడం గౌరవ్, శాంతి, సీతా వంతయింది.

"ఇప్పుడర్థమయిందా?" అన్నాడు శంకరం.

ఆ చిత్రంలో రాజు వేసిన యువతికి, సీతాకీ తేడాలేదు.

"భయ్యా? నాకు కంపెనీ దొరికింది" అంది సీతా, గౌరవ్‌ని చూసి.

శంకరం. శారదా స్టన్నయి చూసేరు. సీతా హఠాత్తుగా యిలా అనడం విని.

రాజు పకపకా నవ్వేడు "నాకూ అదే అనిపించింది. ఇంతకంటే విచిత్ర సంఘటన ప్రపంచంలో యింకెక్కడైనా వుంటుందా? మీరే చెప్పండి" అని సీతాని అడిగేడు.

"డెఫినెట్లీ నాట్ నాకు మతిపోతోంది. మీరు నన్నెప్పుడైనా చూసేరా?" అని అడిగింది సీతా.

"ఆఁ! చూసేను" అన్నాడు సీరియస్‌గా అంతా రాజుకేసి చూసేరు. రాజు నెమ్మదిగా—

"క్రిందటి జన్మలో, ఆ తరవాత నిన్న రాత్రి కలలో" అన్నాడు సీతా కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ. సీతా "స్కౌండ్రల్ యు ఆర్" అంది నవ్వుతూ, ఎంతో మామూలుగా.

శంకరం, శారదాయేకాక, గౌరవ్, శాంతీకూడా కళ్ళు విప్పార్చి చూసేరు యీసారి. గౌరవ్, శంకరంతో అన్నాడు "ఇది మిరాండా హౌస్‌లో నేర్చుకున్న విద్య. మనం యిటు పైనించి చెవులు మూసుకోడం మంచిది" అని.

శంకరం వెంటనే అందుకున్నాడు. "నువ్వు నాకు చెప్తున్నావా? రాజు ఫోనులో ఎవరితోనైనా మాట్లాడుతుంటే నేను చెవులు మూసుకుంటూనే వుంటాను. ఈ రోజుల్లో స్టూడెంట్సుకి ఏమవుతోందో అర్థంకాదు" అన్నాడు.

రాజు విసుగ్గా మొహం పెట్టేడు "కమాన్ చిన్నీ! నువ్వూ ఇంకా కుర్రాడివై అలా ముసిలివాడిలా మాట్లాడకు" అన్నాడు. శంకరం రెండు చేతులూ పైకెత్తి, తల దించి సరెండర్ పోజు పెట్టేడు.


# జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



## జలుబును పోగొట్టుకోవచ్చు

ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, తలభారం, గొంతు నొప్పి, గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే, ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

## జలుబు మందుతో వాటిని ఎదుర్కోండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి.

## కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-64-232 TL

**తారల ఫొటోలు**

శ్రీదేవి.. జయసుధ.. జయప్రద.. జయమాలిని. సుజాత.. మాధవి.. ప్రభ.. కవిత.. ఎయన్నార్. ఎన్టీఆర్.. శోభన్‌బాబు.. కృష్ణ.. కృష్ణంరాజు, మోహన్‌బాబు.. కమలహాసన్.. చిరంజీవి!

వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....! ఫొటోలతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!

ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!

**వై.కె.మూర్తి.**

దాసరివారి వీధి * విజయవాడ-2.



## పవిత్ర రుద్రాక్ష

1 నుండి 14 ముఖములుగల పవిత్ర రుద్రాక్షలు, చందనం, తులసి, పసుపు పచ్చ మరియు గులాబిరంగుల జపమాలలు శిలాజిత్తు, గోరోచనం, దక్షిణావర్త శంఖము, అదృష్టమును కల్పించే శ్రేష్ఠమైన రాళ్ళు లభించును. కోరినవారికి ధరలపట్టి పంపబడును. హిందీ లేక ఇంగ్లీషులో వ్రాయండి.

**Shree Jagdamba Bhawan**
(A. J.) SONEPAT-131001.



## డబ్బు కావాలా?

రూ. 11/-లు పెట్టుబడితో మా (చైను పద్ధతి) స్కీములో సభ్యులుగా చేరి మీ బంధు మిత్రులను చేర్పించడం ద్వారా ఇంట్లోకూర్చుని ప్రతిరోజూ మనియార్డర్ల ద్వారా రూ. 34,952/-లు లాభం పొందండి.

**Sri Vigneswara Money Circulation**
Govt Regd No-711.
Guindy, MADRAS-32.



## నెలకు రూ. 1,000/-లు సంపాదించండి

ఫొటోగ్రఫీ టీచర్ 10/-, ఎలక్ట్రిక్ గైడ్ 10/- టైలరింగ్ & కటింగ్ 10/-, మెడికల్ సెక్స్ గైడ్ 10/-, 88 ఛాయాచిత్రములతో వైవాహిక జీవితం 100 ఛాయాచిత్రములతో 10/-, 300 కాటేజీ ఇండస్ట్రీ గైడ్ 20/-, రేడియో గైడ్ 10/-, సచిత్ర కోకశాస్త్ర 10/- పోస్టేజి 1-50 అదనం.

INTERNATIONAL BOOK Co,
Aligarh 25 (U.P.)


గౌరవ్ తన కుటుంబంతో చష్మశాహీ హట్స్‌లో మకాం పెట్టినట్టు చెప్పేడు. శంకరం వెంటనే అన్నాడు: "గౌరవ్! రేపు మేం యిక్కడ్నించి బయల్దేరి శ్రీనగర్ వస్తాం. కొద్దిగా అటూ యిటూ తిరిగి సాయంత్రానికి చష్మశాహీ హట్స్ చేరతాం మా కోసం ఒక కాటేజి బుక్‌చేసి అట్టేపెట్టు" అన్నాడు.

"నువ్వు రావోయ్! అక్కడ యిప్పుడు కావలసినన్ని హట్స్ ఖాళీగా వున్నాయి. రిజర్వేషను గురించి ఆలోచించకు పేకలు నీ దగ్గరున్నాయా. నేను కొననా? దిగుతూనే మొదలెట్టాలి బ్రిడ్జి" అన్నాడు గౌరవ్.

శారద శాంతి కేసి చూసి నవ్వింది. శంకరంతో "కాశ్మీరు వచ్చింది బ్రిడ్జి ఆడ్డానికా?" అంది.

శంకరం, శారదకి నమస్కారం పెట్టి "ఒక్క రెండు గంటలు ఆడిన తరవాత నీ యిష్టం" అన్నాడు.

"నాకు తెలియదా! రెండు గంటలు పన్నెండు గంటలవుతుందనీ" అంది శారద

గౌరవ్ చెయ్యి చాపి, శారద తల మీద చెయ్యివేసి "మొత్తం అంతా కలిపి ఎనిమిదిగంటలు ఆడదాం. వాచీ దగ్గర పెట్టుకుని మొదలెట్టిన టైం, ఆపిన టైం రాసుకుందాం! ప్రామిస్" అన్నాడు.

"సరే సరే! వద్దంటే మీ రిద్దరూ ఇక్కడే రోడ్డుమీద కూర్చుని మారాం చేసేటట్టున్నారు" అంది శారద నవ్వుతూ.

గౌరవ్ కుటుంబంతో కలిసి వెళ్ళిపోయాడు. శంకరం, రాజూ, శారదా కార్లో కూర్చున్న తరవాత వాళ్లు "ఆడూ" కేసి వెడుతుంటే శంకరం అన్నాడు రాజుతో. "సీతాకి పెళ్ళయిందని నీకు తెలుసా,"

"నిజమా?" అన్నాడు రాజు.

"ఊఁ! అత నిప్పుడు పిహెచ్‌డి చెయ్యడానికి అమెరికా వెళ్ళేడట. జాగ్రత్త" అన్నాడు శంకరం.

రాజు విసుగ్గా మొహం పెట్టేడు.

శారద కలుగజేసుకుంది- "చూడండి. ఆ నది ఎంత బావుందో. నది ఒడ్డు మీది రాళ్ళ మీంచి నడిచి వెడదామా?" అంది

శంకరం అటుకేసి చూసి "ఓమీ! కారాపు" అన్నాడు. రాజు అటుచూసి పళ్ళ మధ్యనించి గాలి పీల్చేడు రాళ్ళమధ్య నించి ప్రవహిస్తున్న నది. అటూ యిటూ వున్న ప్రకృతి సౌందర్యంచూసి అందరి మనసూ ఆనందంతో నిండిపోయింది.

"ఓమీ! కారు తీసుకుని గెస్ట్‌హవుస్‌కి వెళ్ళిపో. మేం అలా తిరిగి వస్తాం" అన్నాడు శంకరం.

రాముకి నిద్రమత్తుగా వుండి కళ్ళు మూసు పడుకున్నాడు. "వీడిని ఓమీతో పంపిద్దాం పదండి తిరుగుదాం" అన్నాడు శంకరం.

శారదా, శంకరం, రాజూ నది వొడ్డున తిరిగి రాత్రికిపహల్‌గామ్‌కి తిరిగివచ్చేరు.

మర్నాడు చష్మశాహీ హట్స్ చేరిన తరువాత శంకరానికీ, గౌరవ్‌కీ ఒళ్ళు తెలియలేదు జానీవాకర్ రెడ్ లేబిల్ విస్కీ పట్టించి బ్రిడ్జిలో పడ్డారు. శారదా, శాంతీ ఇక తప్పక వాళ్ళతో పేకాటకి కూర్చున్నారు.

మధ్యలో శారద అడిగింది "రాజు ఏడి?" అని. గౌరవ్ అన్నాడు "మనమంతా ఇలా కూర్చుని పేకాటలో పడితే రాజు బోరు అయ్యి తిరగడానికి పోయి వుంటాడు"

శారద ఏదో అనబోయి వూరుకుంది. అది గమనించిన శంకరం "ఏమిటన్నట్టు శారదకేసి చూసేడు. అర్థమయి "సీతా ఏదీ?" అన్నాడు.

గౌరవ్ మామూలుగా "రాజుతో వాక్‌కి పోయి వుంటుంది" అన్నాడు.

శాంతి జరుగుతున్నదేదీ పట్టించుకోకుండా పేకముక్కలు చూస్తోంది. శంకరానికి ఏమనాలో తెలియలేదు. 'ఓ' అని ఆటలో మునిగిపోయేడు—

దూరంగా—

చష్మశాహీ గార్డెన్‌లో, రంగు రంగుల దీపాల్లో, విరిపోసిన పువ్వుల మధ్య రాజు, సీతా నడుస్తూ నవ్వుకున్నారు.

"ఇలాంటిరోజు మన జీవితంలో వస్తుందని నువ్వెప్పుడైనా అనుకున్నావా?" అంది సీతా.

"నా పుట్టినరోజు ఏదో తెలుసా?" అన్నాడు రాజు.

"తెలియదు."

"ఈ రోజే" అన్నాడు రాజు. సీతా విరగబడి నవ్వింది. "నిన్ను తిట్టడానికి ఇంగ్లీషులో పదాలు ఖతమ్ అయిపోయాయి. ఖబుర్లు బాగా చెపుతావు" అంది.

రాజు నవ్వేడు. "ఇండియాలో పదమూడు భాషలున్నాయి – రేపొద్దున్న వరకూ తిట్టు" అన్నాడు.

సీతా నవ్వింది "రేపొద్దున్నకి నువ్వెక్కడో నేనెక్కడో. అసలు మనం బ్రతికి వుంటామోలేదో కూడా" అంది.

రాజు సీతా కళ్ళలోకి స్థిరంగా చూసి, హఠాత్తుగా కౌగలించుకున్నాడు — "ఇదీ నా మూడ్! ఇందులో తప్పేమైనా వుంటే క్షమించు మనసు చెప్పిన మాట వినడం జీవితం అని ఇంతవరకూ అలా చేస్తూ వచ్చేను. నా యీ రియాక్షన్ నీకు తప్పుగా

అనిపిస్తే చెప్పు. నిన్ను మళ్ళీ తాకను" అన్నాడు.

సీతా మొహం పైకెత్తి రాజుని ముద్దు పెట్టుకుంది. "సమాధానం మాటల్లో కావాలా?" అంది.

రాజు, సీతా కౌగిలిలో ప్రపంచాన్ని మరచిపోయేడు.

ఆ వెన్నెల రాత్రిలో, పూల సౌరభంలో చల్లటి పిల్లగాలి తాకుతుంటే. చిరుచలిలో రాజుకీ, సీతాకీ స్వర్గం కనబడింది.

కాఫీ చేసి తిరిగివస్తుంటే, రాజు సీతాని అడిగేడు. "గిల్టీగా అనిపించడం లేదుకదా?"

"ఎందుకు? జీవితంలో సుఖపడడానికి దేవుడు యెప్పుడూ అడ్డుచెప్పడని నా నమ్మకం. నీతో ఈ రోజు హాయిగా గడిపినందుకు నేను జన్మంతా ఏడవాల్సిన అవసరం ఏమిటో అర్థంకాదు. సుఖపడడం తప్పయితే, నా వుద్దేశ్యంలో బ్రతకడమే వొక తప్పు" అంది సీతా సూటిగా రాజుకళ్ళల్లోకి చూస్తూ.

రాజు సీతాని గట్టిగా కౌగలించుకున్నాడు "నిన్ను కలుసుకోడం నా అదృష్టం" అన్నాడు.

"అదే నేనూ అనుకుంటున్నా" అంది సీతా.

తిరిగి వచ్చేక శంకరం అడిగేడు "ఎక్కడికి పోయేరు?" అని. వాళ్ళ చతుర్ముఖపారాయణం యింకా జరుగుతూనే వుంది.

రాజు నవ్వుతూ "తిండానికి ఏమైనా వుందా? ఆకలితో ఛస్తున్నాం" అన్నాడు.

టేబిల్ మీద పడివున్న పాకెట్లు చూపించి "నచ్చినదేదో తినండి. కావలిస్తే పోయి పడుకోండి. మా ఆట రాత్రి పన్నెండు గంటలకి ముగుస్తుంది" అన్నాడు శంకరం.

రాజు చేతికి దొరికిన రెండు పాకెట్లు తీసుకుని, సీతాతో కలిసి భోజనం మొదలెట్టేడు.



# మల్లెపందిరి

## లోని తెర తీయాలంటే

ఉద్యంతు శత మాదిత్యాః

ఉద్యంతు శత మిందవః ।

న వినా విదుషాం వాక్యైః

నశ్య త్యాభ్యంతరం తమః ॥

సూర్యుళ్ళెందరైనా, చంద్రులెందరైనా, ఉత్తి గ్యాస్‌తో ఎన్ని లైట్లు వెలిగించినా అవి పై చీకటిని మాత్రమే పోగొట్టగలవు. మూలమూలల నక్కిన చీకటి ఉంటుంది. లోపల దూరిన చీకటి ఉంటుంది. ఆ తెర తొలగించి సర్వత్రా దీపిని ప్రసరింపజెయ్యాలంటే జ్ఞానుల వాక్యాలే శక్తిగలవి. అవి లేనిదే లోని చీకటి తొలగదు.

—సౌభరి

మరునాడు సాయంత్రం షాలిమార్. నిషాత్ గార్డెన్స్. డాల్‌లెక్ తిరిగి వచ్చేక శంకరం, గౌరవ్ ఖబుర్లు పెట్టుకు కూర్చున్నారు. "రాత్రి లైట్ అండ్ సౌండ్ ప్రోగ్రాము వుంది వస్తారా?" అని అడిగేడు రాజు, అందర్నీ చూసి.

"మాకు అలసటగా వుంది. మీరు పోయిరండి" అన్నాడు గౌరవ్.

నీతా, రాజు కలిసి శంకరం కారు తీసుకుని బయల్దేరారు. కొద్ది దూరం రాగానే వర్షం మొదలయింది. కారులో విస్కీ పైకితీసి రాజూ, నీతా కొద్దిగా తాగేరు. రాజు నీతాని దగ్గరగా తీసుకుని కారు నడుపుతుంటే-

"ప్రిన్స్! ఇదంతా తప్పనే వెధవని పిలిచి. ఇలాంటి హాయి యింకెక్కడ దొరుకుతుందో చెప్పమని అడగాలి" అంది నీతా

రాజు నీతాని మరింత దగ్గరగా లాక్కున్నాడు "హోటలుదేనికైనా పోదామా. ఒక రూమ్ తీసుకుని రెండుగంటలుపోయేక తిరిగిపోదాం" అన్నాడు కోరికని కళ్ళల్లో చూపిస్తూ.

నీతా. రాజు ఎడంచెయ్యి తన రెండు చేతుల్లోకీ తీసుకుని 'వద' అంది—

ఇద్దరూ చష్మషాహీ హట్స్ తిరిగి వచ్చే టప్పటికి రాత్రి పదిన్నరఅయింది

"హౌయిాజ్ లైట్ అండ్ సౌండ్" అన్నాడు గౌరవ్

"వెష్" అన్నాడు రాజు — అంతా నవ్వేరు.

డాక్ సుమ్‌లో ప్రవహించే సెలయేరుకి రెండు ప్రక్కలా పచ్చటి మైదానాలు. ఫర్‌చెట్లు. వాటిమధ్యనించి పొడుగ్గా నేల చెరుతున్న సూర్యకిరణాలూ, ఆ మైదానాల మీద గొర్రెలమందని మేతకివదిలి చెట్ల కింద కూర్చున్న కాష్మీరీ షెపర్డ్స్ కుటుంబం. పక్షుల కిలకిలలూ చూసేక అందరూ ఇష్టం వచ్చినవైపుకి నడిచిపోయి ఓ గంటపోయేక కలుసుకుందాం అనుకున్నారు. నీతా రాముని తీసుకుని కొండలమీదికి నడిచిపోయింది

రాజు సెలయేరు గట్టుమీదుగా రాళ్ళమీద నించి వెళ్ళి దూరంగా, నీళ్ళమధ్య ఒక పెద్దరాయిమీదకి చేరి కూర్చున్నాడు. ఓ పావుగంట అకాశం. చుట్టూ. నీరు ప్రవహించే చప్పుడు, పక్షుల చప్పుళ్ళు తప్ప ఆవరించుకున్న శాంతి. నిశ్శబం అనుభవించి. చుట్టూ చూసేడు. అంగరూ ఎక్కడికి పోయేరో. ఒక్కళ్ళూ కనుచూపు మేరలో కనబడలేదు. కళ్ళు మూసుకుని రాయిమీద వెల్లకిలా పడుకున్నాడు. కళ్ళు మూతలుపడి ఓ పావుగంట అవుతుందేమో చెవి దగ్గరగా ఎవరో 'రాజూ' అని పిలిచినట్టు వినబడి కళ్ళు తెరిచేడు ఎదురుగా శాంతిని చూసి లేచి కూర్చున్నాడు

"ఇక్కడ చాలా హాయిగా వుందికదూ! జవహర్‌లాల్ నెహ్రూ రెస్టు తీసుకోడానికి 'డాక్‌సుమ్'. వచ్చేవాడుట" అంది శాంతి

రాజు నవ్వేడు. "భూలోకంలో ఇంత అందమైన ప్రదేశాలుంటాయని నేను ఎప్పుడూ కలలో కూడా ఊహించలేదు. మీకు తెలుసో తెలియదో 'మను చరిత్ర' అనే ఒక తెలుగు కావ్యంలో ప్రవరాఖ్యుడనే బ్రాహ్మణుడు హిమాలయాల్లో తప్పిపోతాడు అక్కడ అతను చూపిన అందాన్ని వర్ణిస్తూ కవి రాసినదంతా ఇక్కడ నాకుకనబడుతోంది. చిన్నప్పుడు మా తెలుగు మాష్టారది చెపుతుంటే ఈ కవులెంత సుందరంగా ఊహిస్తారో — నిజంగా అలాంటి ప్రదేశానికి ఈ జన్మలో ఎప్పుడైనా వెళ్ళగలిగితే ఇంక వేరే స్వర్గం ఎందుకు అనిపించేది" అన్నాడు రాజు.

"అంటే మీరు స్కూలులో వున్నప్పట్నించే రొమాంటిక్ అన్నమాట" అంది శాంత. నవ్వుతూ రాజు విచిత్రంగా ఫీలయ్యాడు. శాంతి కళ్ళల్లోకి చూసేడు.

శాంతి తల వంచుకుని, సెలయేటి నీళ్ళకేసే చూస్తూ అంది "రాజూ! మీ అనుకోవద్దు. మీరూ నీతా చేస్తున్నది ఏమీ బావు లేదు" అంది.

రాజు ఆశ్చర్యంగా చూసేడు. మౌనంగా ఊరుకున్నాడు.

"నీతాతో మాట్లాడేరా?" అని అడిగేడు.

శాంతి నవ్వింది. "నీతా గురించి మీకింతవరకూ అర్థంకాలేదా? అది యెవరి మాటా వినదు. దానికి యెంతతోస్తే అంతే. "మీ రంటే యిష్టం" అంది. "కలిసి తిరిగితే తప్పేమిటి" అంది. "తను కొద్దిరోజులు ఆనందంగావుంటే మీ కెందుకు అసూయ" అంది. తన భర్త గురించి జ్ఞాపకంచేస్తే "అది మా యిద్దరిమధ్యా సంగతి. నీకు ఆ విషయం అనవసరం" అంది. దానికి సమాధానం చెప్పడం నాకు రాదు. నచ్చ చెప్పడం నాకు శక్యంకాదు" అంది.

రాజు బాధగా చూసేడు శాంతికేసి. "అందుకని నాకు నచ్చచెబుదామని వచ్చేరా?" అన్నాడు.

"మీకు నేనిలా మాట్లాడ్డం యిష్టం లేదా?" అంది శాంతి.

"అది కాదు! నే నడిగే ప్రశ్నలూ, చెప్పే మాటలూ కూడా సరిగ్గా నీతా అడిగినవే. ఆ ప్రశ్నలకి మీ దగ్గర సమాధానం లేకపోతే నాకు మాత్రం ఎలా నచ్చ చెపుతారు?" అన్నాడు.

"వినేవాళ్ళకి చెప్పచ్చు" అంది శాంతి.

"సరే అయితే చెప్పండి" అన్నాడు రాజు

శాంతి నవ్వుతూ అంది "డిఫెన్సు

మెకానిజయ్ అవ్‌చేసేరా ?"

"లేదు. లేదు. ఆనెస్టుగా చెప్తున్నా" అన్నాడు రాజు.

"మీ యిద్దరి మధ్యా యీ సంబంధం, దాని భర్తకి ద్రోహం" అంది శాంతి.

రాజేం మాట్లాడలేదు. మళ్ళీ శాంతే అంది.

"నాకు దేవుడిచ్చిన కొద్ది బుర్ర ఉపయోగించి ఆలోచిస్తే మీరిద్దరూ చాలా మామూలుగా సెక్స్‌లో ఇండల్జ్ అవుతున్నారనిపించింది."

ఇలా సూటిగా, చక్కగా, తికమకలు పెట్టకుండా శాంతి అన్నమాట విని రాజు నవ్వేడు. "మీరు యిలా సూటిగా మాట్లాడినందుకు చాలా థ్యాంక్స్. ఇప్పుడు మీతో నేను మనసు విప్పి మాట్లాడగలను. నిజంగా ఈ జీవితంలో మంచేమిటి. చెడేమిటి అర్థంకాదు. దేవుడు మనని ఈ ప్రపంచంలో నవ్వుతూ, హాయిగా వుండమని పంపేడని నా వుద్దేశ్యం. ఆ ఆనందం కోసం వీలయినంతగా యింకెవరినీ కష్టపెట్టకుండా వుండగలిగితే జన్మ ధన్యమయినట్టే" అన్నాడు.

"బాగానేవుంది మీ వేదాంతం. కాని మీ గురించి దాని భర్తకి తెలిస్తే అతను యెంత బాధపడతాడో వూహిస్తే మీరు నా మాటలు అర్థం చేసుకోగలరు" అంది శాంతి.

"మీరు చెప్పినది నిజమే. ఆయనకి తెలిస్తే ఆయన మనస్సు ముక్కలయిపోవచ్చు. ఇలా మనం జీవితంలో చేసే ప్రతి పనికీ ఎవరో ఒకరు బాధ పడేవాళ్ళు దొరుకుతూనే వుంటారు. అందుకని ఏమీ చెయ్యకుండా ఊరుకోవాలా ? రెండో విషయం— ఆయనకి బాధ కలగకుండా వుండాలంటే ఆయనకి ఏమీ తెలియకపోతే సరి. ఈ విషయంలో మీ సహకారంకూడా అవసరం. ఇది విని నన్ను స్కౌండ్రల్ అని అనుకున్నా ఫరవాలేదు. యిలా దాచటం అతి క్రూరమైనదైనా నేనన్నది నిజం కాదా ? మూడో విషయం— నేను బ్రతుకుతున్నది నా సుఖానికా, ప్రపంచంలో మిగిలిన అందరి సుఖానికా? ఇది మరీ విపరీతమైన ఆలోచన అనుకోకండి. అయినా, నిజాయతీగా చెప్తున్నా. అది నా మనసులోమాట- నేను సీతాతో గడిపిన ప్రతీ క్షణం హాయిగా వుంది. సీతాకీ హాయిగా వుంది. ఈ హాయి మాకు దక్కుతున్నందుకు అదృష్టవంతులం అనుకుంటున్నాం. లేనిపోని ఆలోచనలు పెట్టుకుని ఈ అమూల్యమైన ఆనందాన్ని ఎందుకు వదులుకోవాలో చెప్పండి" అన్నాడు రాజు.

"ఏం చెప్పమంటారు ? మీ ధాటిచూస్తే ఇంకో అరగంట యిలా మాట్లాడితే నన్ను కూడా ఇందులోకి లాగేటట్టు వున్నారు" అంది శాంతి నవ్వుతూ. ఇంతలోనే మళ్ళీ సీరియస్‌గా "జోకులు వదిలెయ్యండి కాని. నేనన్నది కూడా ఆలోచించండి. మీరూ అదీ కూడా పెద్దవాళ్ళే. మీ ఉద్దేశ్యాలు, మీ ఆలోచనలూ మీవి. మిమ్మల్ని కూడా మాలాగే బ్రతకమని అనను కాని. ఎలా బ్రతకడం సవ్యం అనిపిస్తోందో ఆలోచించమని చెప్పగలను. నిన్న శంకరంగారూ, మా ఆయనా అన్నట్టు మీ యువతరం జీవిత పద్ధతే చాలా మారిపోయింది. మాకు అర్థం అవడానికే శ్రమ అయిపో



తోంది' అంది. ఒక్క క్షణం ఆగి—

"ఒక మాట చెపుతాను. తప్పుగా అనుకోనంటే" అంది శాంతి.

రాజు నవ్వుతూ ఆవిడకేసి చూసేడు.

"సీతాకి మీరొక్కరే కాదు యిలాంటి మిత్రులు" అంది శాంతి.

రాజు పకపకా నవ్వేడు. "ఫరవాలేదు" అన్నాడు.

"అయితే మిమ్మల్ని సూటిగా అడుగుతాను - మీరిలా వున్నందుకు సిగ్గు వెయ్యదూ? నా ఎదుట మీకు సిగ్గుగా అనిపించడంలేదూ" అంది శాంతి.

"ఎందుకూ? అంత సిగ్గుపడాల్సిన పని నేనేం చేసేను" అన్నాడు రాజు నుదురు చిట్లిస్తూ.

"యూ ఆర్ ఎ రిబెల్" అంది శాంతి.

"థాంక్యూ. చాలా గౌరవనీయమైన మాట వుపయోగించేరు. మాలాంటివాళ్ళని చాలామంది "డిబాచ్" అంటున్నారు ఈ మధ్య" అన్నాడు రాజు.

శాంతి గట్టిగా వూపిరి వదిలి లేచింది. "అలా తిరిగి వస్తాను కూర్చుంటారా, నాతో వస్తారా?" అంది.

"మీరు వెళ్ళండి. కాస్సేపు వంటరిగా కూర్చుంటాను. మీరు తిరగడం అంత ముఖ్యం కాదనుకుంటే కూర్చోండి నేను తెలుగు పాటలు పాడతాను. విందురుగాని" అన్నాడు రాజు.

శాంతి కూర్చుని "పాడండి" అంది.

రాజు గొంతెత్తి హాయిగా పాడాడు. "మీరు కూడా ప్రయత్నించకూడదూ. ఇటువంటిచోట కూర్చుని పాడటం ఒక చక్కటి అనుభవం" అన్నాడు.

శాంతి పాడింది. రాజు ఆ పాట విని కళ్ళు పెద్దవి చేసి చూసేడు.

"మీరు బాగా పాడతారు, నా కింత వరకూ తెలియదే!" అన్నాడు.

"ఎలా తెలుస్తుంది? ఎందుకు తెలియాలి" అంది శాంతి

"నిజమే" అని నవ్వుతూ తలూపేడు రాజు.

కొంచెంసేపు పోయేక అంతా కలుసుకున్నారు.

ఢిల్లీ తిరిగి వెళ్ళేముందు సీతా, రాజుకి గుడ్ బై చెపు—

"మనం మళ్ళీ యెప్పుడూ కలుసుకోవద్దు" అంది నెమ్మదిగా.

రాజు "స్యూట్స్ మీ ఫైన్" అని నవ్వేడు.

దూరంనించి చూస్తున్న మిగిలినవాళ్ళకి ఈ మాటలు వినబడలేదు.

శంకరం కారులో కూర్చున్నాక అన్నాడు "రాజూ! మరీ అంత విచ్చలవిడిగా రొమాన్సింగ్ చెయ్యాలా? కాస్త దాపరికంవుంటే మేం కాస్త ఫ్రీగా వుండగలుగుతాం."

* * *

రాజు ఇంజనీరింగు పరీక్షలు పూర్తి చేసేడు. మంచి మార్కులతో ప్యాసయేక వుద్యోగం వెతకడం మొదలెట్టేడు.

"అమెరికాలో యమ్. యస్. కి ట్రై చెయ్యి సీటు దొరికితే డబ్బు నేనిస్తాను" అన్నాడు శంకరం.

తీరిక ఎక్కువయి మిత్రులతో కలిసి తిరగడం ఎక్కువయింది రాజుకి.

ఒకరోజు ప్లాజాలో సినిమాకి పోడానికి మ్యాటనీకి మూడు టిక్కెట్లు తెచ్చేడు రాజు.

"నాకు వీలుపడదురా. నువ్వూ వదినా వెళ్ళండి" అన్నాడు శంకరం.

సినిమా హాల్లో వాళ్ళకి రాజు మిత్రుడొకడు కనబడ్డాడు. అతను యూనివర్శిటీలో యమ్మే చేస్తున్నాడు.

"రాజూ! ఉద్యోగం దొరికిందా?" అన్నాడు ఆ మిత్రుడు ప్రమోద్.

"లేదింకా. అమెరికాలో గ్రాడ్యుయేట్ స్టడీకి ప్రయత్నిస్తున్నాను. దొరికితే మొదటి ప్రిఫరెన్సు దానికే" అన్నాడు రాజు.

"బై దిబై నా కజిన్ ముక్తా! లేడీ శ్రీరామ్. కాలేజీలో ఎకనామిక్సు చేస్తోంది" అన్నాడు ప్రక్కనున్న అమ్మాయిని పరిచయం చేస్తూ.

ముక్తా "హలో" అంది.

సినిమా తరువాత ప్రమోద్‌నీ, ముక్తానీ యూనివర్శిటీలో వదిలి వెళ్ళిపోదామంటే శారద 'సరే' అంది. వాళ్ళ హాస్టలు దాకా వెళ్ళిన తరువాత, టీ తాగి వెళ్ళమని బలవంతం చేసేడు ప్రమోద్.

"అరగంటలో వెళ్ళిపోదాం వదినా, నువ్వూ యూనివర్శిటీ హాస్టలు ఎప్పుడూ చూడలేదు కదా! రా?" అన్నాడు రాజు.

హాస్టలులోకి అడుగు పెట్టగానే, ప్రమోద్ సిగరెట్టు వెలిగించి ముక్తాకి కూడా ఒకటిచ్చేడు. "ఆంటీ! ఇఫ్ యూ డోంట్ మైండ్" అంటూ ముక్తా సిగరెట్టు తీసుకుని వెలిగించింది. శారదకి అదోలా అనిపించినా పైకి ఏమీ అనకుండా ముభావంగా వూరుకుంది. వాళ్ళంతా ప్రమోద్ రూములోకి వెళ్ళిన తరువాత ఆ సిగరెట్టు వాసన ఆదోరకంగా అనిపించింది శారదకి.

ప్రమోద్ టీకి ఆర్డరు చెయ్యడానికి బయటకు వెళ్ళగానే రాజుతో అంది, "రాజూ ఏమిటీ గోల? ఆ సిగరెట్లు నువ్వు చెప్పిన రీఫర్సు కాదుకదా!" అంది.

రాజు నవ్వేడు "తెలివయినదానివే! ఇక్కడ అది మామూలే" అన్నాడు.

"నాకేదో భయమేస్తోంది. వద పోదాం" అంది శారద.

"టీ తాగి పోదాం" అన్నాడు రాజు.

ఇంతలో ముక్తా వచ్చి రాజు చెవిలో ఏదో చెప్పింది. రాజు సీరియస్‌గా లేచి "వదినా! ఒక్క పదినిముషాల్లో వస్తాను. ఈ అమ్మాయికి ఫారిన్ యూనివర్శిటీల గురించి కొన్ని విషయాలు చూడాలి" అన్నాడు.

శారద "సరే వెళ్ళు. తొందరగా రా పోదాం" అంది.

ఏం తోచక అక్కడ పుస్తకాల రాక్ మీంచి ఒక మాగజైన్ తీసి చదవడం మొదలెట్టింది. ఇంతలో ప్రమోద్ వచ్చి "రాజు ఎక్కడ?" అని అడిగేడు.

"తెలియదు. ముక్తాతో యెక్కడికో వెళ్ళేడు" అంది శార

ప్రమోద్ రూమ్ ...ంచి బయటకువెళ్ళి వెంటనే తిరిగివచ్చేడు నవ్వుకుంటూ.

"రాజు కనబడ్డాడా?" అని అడిగింది శారద.

**HORSLEY HILLS SCHOOL**
**HORSLEY HILLS**
Horsley Hills (P.O)
Chittoor (Dt) A.p.

An english medium school for boys and girls run on Public school lines is affiliated to Council for Indian School Certificate Examinations New Delhi. Few admissions only will be made into classes I, II and III. For further particulars please write to the Principal.

మీకు బొమ్మలు గీయాలనివుందా?
అనుభవజ్ఞులైనవారలపర్యవేక్షణలో కొద్దిపాటి దీక్షతో మీరుసిద్ధహస్తులైన చిత్రకారులు కాగలరు



వివరాలకు రూ.1-00 M.O పంపండి
చిత్రలేఖ
ఆర్టుస్కూలు
6/4, శివన్ కోయిల్ స్ట్రీట్
మద్రాసు 600026

"అతనూ, ముక్తా బిజీగా వున్నారు" అన్నాడు అతను నవ్వుతూ.

బోయ్ టీ రూమ్‌లోకి తేగానే, బోయ్‌ని పంపి టీ తయారుచేసేడు ప్రమోద్. అతను కాలుస్తున్న సిగరెట్టు వాసనచూస్తే శారదకి వాంతి వస్తుందనిపించింది. అతని కళ్ళలో ఎర్రజీర నెమ్మదిగా రావడం చూస్తే భయమెయ్యడం మొదలెట్టింది.

మళ్ళీ అడిగింది "రాజుని పిలుస్తారా? లేటవుతోంది" అని.

ప్రమోద్ "రాజు యిప్పుడే రాడని చెప్పేనా! అర్థం అవ్వలేదేమిటి" అన్నాడు. ఈసారి అతని గొంతుకలో వినబడిన మత్తు చూస్తే శారదకి వణుకొచ్చింది. అతని చూపు కూడా వెర్రిగా అవడం మొదలయింది. నెమ్మదిగా లేచి ప్రమోద్ తలుపు గడియ పెట్టేడు. శారద ఏదో కీడు శంకించి, కుర్చీ లోంచి లేచింది. ప్రమోద్ ఏదో పూనినవాడిలా వచ్చి శారద మీద పడ్డాడు.

శారద గొంతులో ఏదో అడ్డం పడినట్లనిపించింది అరుస్తే నోట్లోంచి గట్టిగా ధ్వని కూడా రాలేదు ప్రమోద్ చేతులు వంటిమీద పాకుతుంటే "రాస్కెల్! నేను రాజు వదినని-వదులు" అంది.

ప్రమోద్ పిచ్చివాడిలా చూసేడు "అయితే ఏమిటి?" అన్నాడు. మళ్ళీ తనే ముద్ద ముద్దగా మాట్లాడేడు "ఇప్పుడు రాజు వున్నది నా కజిన్‌తో. అయితే ఏమిటి. సోవాట్— సోవాట్" అని అదే మాట మారుమారు అనడం మొదలెట్టాడు.

ప్రమోద్ చేస్తున్న అక్రమానికి శారద స్పృహ కోల్పోయింది.

మళ్ళీ స్పృహవచ్చే టప్పుడికి, మొహం మీద నీళ్ళు జల్లుతూ రాజూ. ప్రమోద్. ముక్తా కనబడ్డారు. ప్రమోద్ చింపిరి జుత్తుతో. ఇంకా కొద్దిగా మందుప్రభావంతో వెర్రిగా చూస్తూ "ఆవిడకి షాక్ వచ్చింది" అన్నాడు.

రాజు "నువ్విలా చెయ్యకుండా వుండాల్సింది ప్రమోద్" అంటున్నాడు.

"నాకు ముందు చెపితే ఈ గదిలోకే వచ్చేవాడిని కాదు రాజూ! నేను డ్రగ్‌లో వున్నానని తెలిసుండీ ఎందుకు చెప్పలేదు" అన్నాడు ప్రమోద్ చేతులు జోడించి.

శారద ప్రయత్నించి లేచి కూర్చోగానే, చెయ్యి చాచి బలమంతా ఉపయోగించి రాజుని చెంపమీద కొట్టింది. రాజు. శారద రెండు కాళ్ళూ పట్టుకున్నాడు ఏడుస్తూ.

## ఆకాశం

మేఘంలోని మెరుపులు
ప్రేమలేఖల్లా కనిపిస్తాయి!
ఇంతవరకూ ఆ లేఖల్ని మాత్రం
చదవలేదు!
ఇంతవరకూ ఆ ప్రియురాలు మాత్రం
కనిపించలేదు!

—మిరియాల రామకృష్ణ

"దుర్మార్గుడా! వద్దంటే ఈ వెధవ రూముకి తెచ్చేవు. అంతా నాశనం అయిపోయింది" అని వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది.

రాజు ఏదో ట్రాన్స్‌లో వున్నట్టు స్తబ్దుగా చూడ్డం మొదలెట్టేడు. అతని కళ్ళల్లోంచి ధారలుగా నీళ్ళు రావడం మొదలెట్టేయి.

"నిన్ను క్షమించమని అడగడానికి కూడా అర్హతలేదు నాకు" అన్నాడు రాజు.

"చాలు, చాలు! నాకేసి చూడకు. ఇంక ఎలా బ్రతకాలోకూడా అర్థం అవడం లేదు నాకు" అంది శారద.

రాజు చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడిచేడు

ప్రమోద్ మధ్యలో అన్నాడు "రాజూ మీరింక యింటికి వెళ్ళండి. నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకో—" అని శారద కేసి తిరిగి రెండు చేతులూ జోడించి. తలదించి నమస్కారం చేసేడు — "వీలయితే క్షమించండి" అన్నాడు.

శారద లేచి మొహం కడుక్కుంది. ఆవిడ మొహంలో హఠాత్తుగా ఒక రకమైన ఉదాసీనత వచ్చింది.

కారులో ఇంటికి వస్తుంటే అంది—

"రాజూ! జరిగినది ఒక దారుణమైన పీడకల. ఈ విషయం చెపితే మీ అన్నయ్య పిచ్చెక్కి చచ్చిపోవచ్చు. ఆయన మనస్సు బద్దలవడం ఖాయం. చెప్పకపోతే ఇది జ్ఞాపకం వచ్చినప్పుడల్లా లోలోపలే నేను కుళ్ళి కుళ్ళి ఏడ్చుకోవాలి. ఈ బాధే నా జీవితాన్ని ఓ రోజు అంతం చేసేస్తుంది. చెప్పి ఆయన్ని బాధపెట్టదంకన్నా, చెప్పకుండా నా మనసులో దాచుకుని నేను చిత్రవధ అవడమే మేలు. ఆయన చెయ్యని పాపానికి ఆయన్ని శిక్షించడం అన్యాయం. ఈ రహస్యం నీతోనే చచ్చిపోనీ. నువ్వు నా కళ్ళముందుకు రాకు. నువ్వంటే నాకు అసహ్యం వేస్తోంది. ఒక జంతువుకంటే హీనంగా కనబడుతున్నావు. రామకీ నీకూ మధ్య యింతకాలం తేడా కనబడలేదు. ఈరోజు నీకంటే హీనమైన మనిషి కనబడ్డంలేదు నాకు. నువ్వు. మీ నవ నాగరిక మిత్రులు బ్రతుకుతున్నది మనిషి బ్రతుకు కాదు-అది ఒక కుక్కబ్రతుకు-దానికి కట్టుబాట్లులేవు. మనిషి జీవితంలో వుండాల్సిన అందం లేదు" అంది.

శారద మాటల్లో నిశ్చలత్వం. గొంతులో స్థిరత్వం చూసి, రాజు దేవుడి ముందు నిలబడినట్లు ఫీలయ్యేడు. ఏం మాట్లాడాలో తెలియక తలూపాడు. జరిగినదంతా తన వేదాంతంలో ఎక్కడ యిముడుతుందో అతనికి అర్థం కాలేదు.

ఇంటికి రాగానే, శంకరం అమాయకంగా ఏవో ఖబుర్లు చెప్పడం మొదలెట్టేడు. శారద పని వున్నట్టు వంట గదిలోకి పోయింది. రాజు శంకరంతో డ్రాయింగు రూములోనే కూర్చున్నాడు.

"ఏం అలా వున్నావు? ఒంట్లో బావు లేదా?" అన్నాడు శంకరం.

రాజు నవ్వు తెచ్చి పెట్టుకున్నాడు

"ఎల్లుండి హైదరాబాదు వెళ్ళాలి" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు శంకరం.

"ఇందాక మా ప్రొఫెసర్‌గారు కనబడ్డారు. 'ఐ డి పి యల్'లో ఖాళీలున్నట్టు ఇన్‌స్టిట్యూట్‌కి ఉత్తరం వచ్చిందట. నేను ఆంధ్ర ప్రిఫర్ చేస్తే వెళ్ళి ఇంటర్వ్యూ యిమ్మన్నారు. రేపు వెళ్ళి ఆఫీసు నుంచి వివరాలు తీసుకుని ఎల్లుండి పొద్దున్న ఏ పి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరతాను" అన్నాడు రాజు.

"దానికి విచారంగా ఎందుకు వుండడం? అయినా. నీలాంటివాడు గవర్నమెంటు వుద్యోగం ఎంతకాలం చెయ్యగలడు? కొంచెం ఓపికపడితే ప్రయివేటు కంపెనీలో దొరుకుతుంది. నీలాంటివాడు ప్రయివేటు కంపెనీలో వుద్యోగం తీసుకుంటే చకచకా పైకివస్తాడు. నేనుడిసియమ్‌లోనూ. లీవర్స్‌లోనూ వున్న ఫ్రెండ్స్‌తో చెప్పి అట్టేపెట్టేనుకూడా" అన్నాడు శంకరం.

శంకరం అభిమానానికీ, జరిగిన దాని జ్ఞాపకానికీ రాజుకి కన్నీళ్ళాగలేదు. కళ్ళల్లో ఏదో పడినట్టు నటించి. లేచి బాత్‌రూమ్‌లోకి పోయి, మనసారా ఏడిచాడు. ●